క్లుప్తంగా

మల్లు రవిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే మల్లు రవిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలబోకె అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజును ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా మల్లు రవి శాలువాతో సన్మానించారు. ఇద్దరూ వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై చర్చించుకున్నారు.

ఎమ్మెల్యే దొంతిని..

నెక్కొండ: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని వీఓఏలు హనుమకొండలోని నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు పోశాల యాకాంబ్రం వీఓఏల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వీఓఏల సమస్యలను ప్రస్తావించనున్నట్టు వీఓఏలకు ఎమ్మెల్యే మాధవరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి సమ్మెట అనిత, కోశాధికారి కొంకాల సతీశ్, సభ్యులు పెండ్యాల శ్రీలేఖ, మూసిన అరుణ, సూర్య, శ్రీనివాస్, సునిత, మహేందర్ పాల్గొన్నారు.

అమెరికాలో నర్సంపేట మహిళ ఆత్మహత్య



లావణ్య (ఫైల్)

నర్సంపేట రూరల్ : అమెరికాలో నర్సంపేట మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలుఇలా ఉన్నాయి. నర్సంపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త , పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ కోడలు లావణ్య (30) అమెరికాలోని ఫుడ్‌క్యాటరింగ్ సర్వీసెస్ నడుపుతోంది. టెక్సాస్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం


ఖానాపురం: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని కొడ్తిమాటుతండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలు ఇంటి సమీపంలో రెండున్నర ఎకరాల గడ్డిని నిల్వ చేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. తండావాసులు గమనించి ఆర్పివేసే ప్రయత్నం చేయగా మంటలు తగ్గకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

రూ.50 వేల సాయం



గీసుకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ తోటి మిత్రుడి కుటుంబానికి రూ.50 వేల సాయం అందించి అండగా నిలిచారు. ఎస్కే వాజీద్ గతేడాది కరోనాతో మృతి చెందగా అతడితో కలిసి టెన్త్ చదువుకున్న మిత్రులు ఆయన ఇద్దరు కూతుర్లకు ఆదివారం రూ.50 వేల సాయం అందించారు. కార్యక్రమంలో వాజీద్ మిత్రులు శివప్రసాద్, తాటికొండ నరేందర్, నర్సింహస్వామి, ఆసం లింగమూర్తి, భవాని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నివాళి



ఖానాపురం: మండలంలోని బోటిమీదితండాకు చెందిన హేమ్లు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పరిహారం ఇప్పించండి

ఆత్మకూరు : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన తమకు పరిహారం ఇప్పించాలని బాధితులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి కోరారు. సర్పంచ్ పి.రాజు ఆధ్వర్యంలో బాధితులు ఎమ్మెల్యేను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు.

గ్రంథాలయ ఉద్యమకర్తగా రవికుమార్

● రెండు దశాబ్దాలుగా విద్యార్థుల కోసం కృషి

నర్సంపేట: విద్యావేత్త, కవి, సామాజిక కార్యకర్త, ఆధునిక గ్రంథాలయ ఉద్యమకర్తగా పట్టణంలోని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు కాసుల రవికుమార్ సమాజానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. నర్సంపేటకు చెందిన ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్ కటిక పేదరికంలోనూ చదువు కొనసాగించాడు. 20 ఏళ్ల ప్రాయంలోనే లీడ్ ఫౌండేషన్‌ను ప్రారంభించి రెండు దశాబ్దాలుగా పేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాస తరగతులను బోధిస్తున్నారు. రవికుమార్ ఇప్పటివరకు ప్రతి వేసవిలోనూ 25 ఉచిత లీడ్ స్పోకెన్ ఇంగ్లిష్ బ్యాచ్‌లను నిర్వహించి 3 వేల మందికిపైగా విద్యార్థులకు ఆంగ్లంలో ఉచితంగా మెళకువలు నేర్పించారు. నర్సంపేట, ములుగు ప్రాంతాల్లో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా తను రూపొందించిన 'గ్లోబల్ ఇంగ్లిష్ గ్రామర్' పుస్తకాన్ని విద్యార్థులందరికీ ఉచితంగా అందిస్తున్నారు. ఇటీవల తన నివాసంలోని సగభాగంలో పిల్లల కోసం 20 వేల పుస్తకాలతో లీడ్ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. లీడ్ (లీడ్ కార్ లైబ్రరీ) సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో 25 లీడ్ గ్రామీణ గ్రంథాలయాలను నెలకొల్పి ఒక్కోదాంట్లో 500 నుంచి వెయ్యి పుస్తకాలను అందుబాటులో ఉంచారు. లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ప్రతీఒక్కరిని పుస్తకాలకు చేరువ చేసే ఉద్దేశంతో ప్రారంభించిన 'హగ్ ఏ బుక్ ఛాలెంజ్' అనేక మందిని చైతన్యవంతం చేస్తోంది. 'ముగింపు లేని వాక్యం', 'గడ్డ కట్టిన నది' ఆయన కలం నుంచి వెలువడిన కవితా సంపుటాలు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 10 వేల మందికిపైగా విద్యార్థులకు లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. బోధనలో ఉత్తమ ఫలితాలను సాధించడంతోపాటు రిసోర్స్‌పర్సన్‌గా, సాహితీవేత్తగా, సామాజికవేత్తగా, ప్రకృతి ప్రేమికుడిగా, ఆధునిక గ్రంథాలయ ఉద్యమకర్తగా ఆయన కృషి చేస్తున్నారు. సేవా కార్యక్రమాల కోసం రవికుమార్ ప్రతీనెల తన వేతనంలో 33 శాతం కేటాయిస్తున్నట్టు తెలిపారు. రవికుమార్‌ను బహుముఖ ప్రజ్ఞాశాలిగా చెప్పవచ్చు. 'పేదరికంపై యుద్ధానికి చదువే ఆయుధం' నినాదంతో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతున్న రవికుమార్ మేధావులు, అధికారుల ప్రశంసలు అందుకున్నారు. తమ సమయాన్ని, సంపదను, ప్రతిభను సమాజానికి తిరిగి ఇచ్చే క్రమంలో లీడ్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు.



రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



నర్సంపేటలోని నూతన గ్రంథాలయం

కేజీబీవీలో నీటి కష్టాలు

● మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ)లో నీటి కోసం విద్యార్థినులు రెండ్రోజులు ఇబ్బందులు పడ్డారు. మిషన్ భగీరథ నీటి సరఫరా శుక్రవారం నిలిచిపోగా పాఠశాలలోని బోరు బావి నుంచి నీరు తోడే ప్రయత్నం చేసినా మోటారు కాలి పోవడంతో విద్యార్థినులు అసౌకర్యానికి గురయ్యారు. సర్పంచ్ సుంకరి సాంబయ్య స్పందించి తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. విద్యాలయంలో 258 మంది విద్యార్థినులుండగా క్రిస్మస్ సెలవులతో కొందరు ఇళ్లకు వెళ్లగా మిగతా 130 మంది విద్యార్థినులు పాఠశాలలో ఉన్నారు. కాగా ధర్మసాగర్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిసింది. అదే సమయంలో బోరు బావి మోటారు మరమ్మతులకు గురికావడంతోనే దుస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం వరకు మిషన్ భగీరథ నీరు అందడంతోపాటు బోరు బావి మోటారు మరమ్మతులు పూర్తి కావడంతో విద్యార్థినులు ఊపిరి పీల్చుకున్నారు.



నీటిని పట్టుకుంటున్న విద్యార్థినులు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం

శుక్రవారం నాడు నీటి సరఫరా నిలిచిపోయింది. బోరు బావి ద్వారా నీటిని తోడి సంపు నింపాం. అంతలోనే బోరు బావి మోటారు కాలి పోయింది. వెంటనే సర్పంచ్‌కు పరిస్థితి వివరించడంతో ఆయన స్పందించి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. ఆదివారం మిషన్ భగీరథ నీటి సరఫరా మొదలైంది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులూ లేవు.

-కరుణశ్రీ, ప్రిన్సిపాల్, కేజీబీవీ

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



నర్సంపేట: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దాతలు



రాయపర్తి :పూజ చేస్తున్న అయ్యప్పస్వాములు

నర్సంపేట: నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవ మహా అన్నదాన కార్యక్రమం ఆదివారం కొనసాగింది. అర్చకులు అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణిసాయి రియల్ ఎస్టేట్, శ్రీరాముల శంకరయ్య అమృత, కార్తీక్, విష్ణుప్రియ, కొండి చందనబాబు స్వాతి, రావుల రాజ్‌కమలాకర్‌రెడ్డి నర్మద, పబ్బ శ్రీనివాస్ సృజన, శివరాత్రి శ్రీనివాస్ ఉషారాణి, ఇరుకుల శ్రీధర్ శ్రీలత, పలకల మల్లేశ్వర్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, పోసాల రమేశ్, కోటగిరి రాజు స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మాధవ శంకర్‌గుప్తా మాట్లాడారు. ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న ఆలయ ద్వితీయ మహా కుంభాభిషేకానికి భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్, దొడ్డ వేణు, మల్యాల రాజు, పాలకుర్తి శ్రీనివాస్, శింగిరికొండ వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

రాయపర్తి: మండలంలోని మైలారంలో అయ్యప్ప పడిపూజ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, స్వాములు భారీ సంఖ్యలో పాల్గొని భజన చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పూజలో ఎస్సై విజయ్‌కుమార్, ఎస్‌ఆర్‌ఆర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, సర్పంచ్ సుమతి యాదవరెడ్డి, మధుకర్‌రెడ్డి, హరిప్రసాద్, హమ్యనాయక్, కృష్ణారెడ్డి, గురు, కన్నె స్వాములు పాల్గొన్నారు.



పర్వతగిరి: అయ్యప్పస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా పంబారట్టు

పర్వతగిరి: మండల కేంద్రంలో అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో ఆదివారం పంబారట్టు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అయ్యప్పస్వామిని వాడవాడలా ఊరేగిస్తూ సంకీర్తనలతో పెద్ద చెరువు రిజర్వాయర్ వరకు తీసుకెళ్లారు. అనంతరం పెద్దమ్మతల్లి ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద చెరువు రిజర్వాయర్‌లో పంబారట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, సునీల్‌రావు, సూరయ్య, గురుస్వామి ఫణిశర్మ, చింతకుంట్ల మల్లికార్జున్, జూలపల్లి సురేందర్‌రావు, కక్కెర్ల భానుప్రసాద్, అర్శం ఆనంద్ పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు తరలిన స్వాములు

చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు ఇరుముడితో శబరిమలకు వెళ్లారు. తొలుత నర్సంపేటలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గొడిశాల సురేందర్ స్వామి, రాజు, వేణు, రాజేందర్, ముదురు రమేష్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి: 1985–86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



నల్లబెల్లి : నాటి గురువులతో పూర్వవిద్యార్థులు



నెక్కొండ: పూర్వవిద్యార్థులు, నాటి టీచర్లు

దుగ్గొండి: ఎక్కడెక్కడో పుట్టారు.. ఒక్కచోట చేరారు. చదువులమ్మ తల్లి ఒడిలో పదేళ్లపాటు కలిసి చదువుకున్నారు. అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తాజాగా 38 ఏళ్ల అనంతరం ఆదివారం నాడు మళ్లీ ఒక్కచోట చేరారు. దోస్త్ మేరా దోస్త్.. అంటూ సందడి చేశారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 70 మంది విద్యార్థులు స్థానిక పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి తరగతి గదుల్లో కూర్చుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలని, శేష జీవితంలోనూ కలిసి ఉండాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పెండెం తిరుపతి, ఒరుగంటి తిరుపతి, గుడిపెల్లి ధర్మారెడ్డి, వేముల రవీందర్, అమ్మ కుమారస్వామి, కుసుంబ బాబురావు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, రవి, వీరారెడ్డి, కొమ్మెర మల్లన్న, నర్ర రంగారెడ్డి, రక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, అబ్దుల్ రజాక్, అన్న లక్ష్మన్న పాల్గొన్నారు.

23 ఏళ్ల తర్వాత..

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెంలోని కాకతీయ గురుకుల విద్యాలయంలో 2000–01 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆ విద్యాలయంలో కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ వివాహాల నంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా వాట్సాప్ వేదికగా కలుసుకుని విద్యాలయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్‌రావు, డైరెక్టర్ గాదె రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ రణధీర్, మాషుక్, ఉపాధ్యాయులు రాయబోస్, శర్మ తదితరులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాటి గురువులు వారిని అభినందించారు. ఇన్నేళ్ల తరువాత మళ్లీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక వేదికపై కలుసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు పెరుమాండ్ల జితేందర్‌రెడ్డి, వక్కల వెంకటేశ్, కూసబాబురెడ్డి, గాదె అమరేందర్, గట్ల వంశీకృష్ణ, మామిండ్ల గోపీ, ఉషారాణి, స్వర్ణలత, సుమలత, గౌతమి, రాణి రుద్రమ పాల్గొన్నారు.

నాటి గురువులకు సన్మానం..

నెక్కొండ: మండలంలోని సూరిపెల్లి జెడ్పీ హైస్కూల్‌లో 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సమేళనంలో నిర్వహించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన వారంతా పాఠశాలలో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకొని మరొకసారి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. బాల్యంలో ఆడిపాడుతూ ఒకచోట చదువుకుని విడిపోయిన స్నేహ బంధం మళ్లీ 20 ఏళ్ల తర్వాత కలిసి సంబురాలు చేసుకుంది. వేడుకల్లో భాగంగా నాడు విద్యాబోధన అందించిన గురువులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు సదానందం, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, మంజూర్‌అలీ, ధన్‌సింగ్, సుబ్బారావు, అండాలు, పూర్వవిద్యార్థులు సతీశ్, విజేందర్, రాజు, సాగర్, చందన, సుమలత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



చెన్నారావుపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీ అయిన కానిస్టేబుల్ కోట శివను రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సొసైటీ మాజీ డైరెక్టర్ జంగిలి సమ్మయ్య, సాధు నర్సింగరావు, ఆకుల పెల్లి అజయ్, యాదగిరి, ఈశ్వర్ ఆదివారం శాలువాతో సన్మానించారు. తన సేవలను గుర్తించి తనను సన్మానించిన ప్రతీఒక్కరికి కానిస్టేబుల్ శివ కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య రామమందిర అక్షింతలతో ర్యాలీ



ఖానాపురం: అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన అక్షింతలతో మండల కేంద్రంలోని రామాలయ హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో బాధ్యులు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కమిటీ బాధ్యులు కాలినడక ఖానాపురం, బుధరావుపేట, మంగళవారిపేట, ధర్మరావుపేట, కొత్తూరు గ్రామాలకు అక్షింతలను ర్యాలీగా తీసుకెళ్లారు. ఖానాపురంలోని రామాలయంలో రామపారాయణ పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని కమిటీ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముడుసు రమేశ్, పగడాల రాంనర్సింహారెడ్డి, బిక్కు చౌదరీ, గొల్లపూడి ఉమారాణి, కొత్తపెల్లి వెంకటేశ్వర్లు, పాలెల్లి జానయ్య, కుమారస్వామి, ప్రభావతి, సంపూర్ణ, హైమ, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

నర్సంపేట: లైంగిక వేధింపుల నుంచి బాలబాలికలను రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టంపై సమాజంలోని ప్రతీఒక్కరికీ అవగాహన ఉండాలని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ తెలిపారు. పట్టణంలోని గీతాంజలి గ్లోబల్ పాఠశాల ఉపాధ్యాయులకు లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలపై జరుగుతున్న అమానవీయ ఘటనలు సమాజాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నాయని చెప్పారు. సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్రమైన పోక్సో చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. వికృత చేష్టలతో పిల్లల జీవించే హక్కును హరించి వారికి ముప్పు వాటిల్లేలా చేస్తే ఆ చట్టం ద్వారా కఠినంగా శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. 2012లో వచ్చిన పోక్సో చట్టం 18 ఏళ్లలోపు బాలలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. అలాగే 12 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠిన శిక్ష అమలయ్యేలా చట్టాన్ని రూపొందించారని చెప్పారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా తమవంతు బాధ్యతగా పిల్లలకు, తల్లిదండ్రులకు ముందు నుంచే పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. సదస్సులో గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై వివరిస్తున్న రవికుమార్

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాయపర్తి: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు అబ్బోజు రామ్మోహన్‌చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నకారే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్మోహన్‌చారి మాట్లాడారు. ప్రతీనెల 1న పింఛన్ అందించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆకాంక్షించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు ఆకుల నరేందర్‌రావు, కాంచనపల్లి వనజారాణి, సోమలక్ష్మీ, బుచ్చమ్మ, యశోద, తదితరులు ఉన్నారు.



నకారే చిత్రపటానికి పూలమాల వేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నేను కూలీ బిడ్డనే..

దామెర : స్థానిక ఎస్సై కొంక అశోక్ ఆదివారం ల్యాదెళ్ల–దమ్మన్నపేట గ్రామాల మధ్య పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో దమ్మన్నపేట గ్రామం సమీపంలో చెట్టుకింద కూర్చొని కొంతమంది కూలీలు భోజనం చేస్తున్నారు. ఇది గమనించిన ఎస్సై వారి వద్దకు వెళ్లి వారితో మాట్లాడి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు తెచ్చుకున్న భోజనం తిన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కన్నీటి పర్యంతమవుతూ.. తాను సైతం పొలం పనులు చేసేవాడినని, కూలీబిడ్డనే అని గుర్తు చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల విషయంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితిలో డయల్–100కు ఫోన్ చేయాలని సూచించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ఎదగాలి

వర్ధన్నపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ఉన్నతంగా ఎదగాలని ఉస్మానియా, తెలంగాణ విశ్వవిద్యాలయాల మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ కోరారు. తన సతీమణి, హైకోర్టు న్యాయవాది చంద్రకళ జన్మదినం, క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని అంబేడ్కర్ నగర్‌లోని క్యాథలిక్ చర్చిలో పేద క్రైస్తవ మహిళలకు ఆదివారం ఆయన చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. అంబేడ్కర్ యువతకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. పేదల బతుకులు మారాలంటే ప్రపంచానికి యేసుక్రీస్తు బోధనలు మార్గదర్శకం కావాలన్నారు. అంబేడ్కర్, యేసుక్రీస్తు అందించిన బోధనలతో దళితులు జ్ఞాన సమాజాన్ని నిర్మించి ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ ప్రకాశ్, ప్రతాప్, హైకోర్టు న్యాయవాది చంద్రకళ, సామాజిక కార్యకర్త బంకా మాణిక్యరావు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న వినోద్‌కుమార్ దంపతులు

'క్రిస్మస్'కు ప్రార్థనా మందిరాల ముస్తాబు



దుగ్గొండి: తొగర్రాయిలోని చర్చి



రాయపర్తి : క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి



చెన్నారావుపేట : సీఎస్ఐ చర్చి

దుగ్గొండి: క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనా మందిరాలను సిద్ధం చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొగర్రాయి, నాచినపల్లి, తిమ్మంపేట, చలపర్తి, లక్ష్మీపురం, బంధంపల్లి, దుగ్గొండి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాయపర్తి: మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి నుంచి క్రీస్తు ఆరాధనలు జరుగుతాయి. స్థానిక సంఘ కాపరి డికెన్ ఫాదర్ బి.జోసెఫ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందేశం అందించనున్నారు.

చెన్నారావుపేట: మండలంలోని ప్రార్థనా మందిరాలు విద్యుత్ కాంతులు, నక్షత్రం, క్రిస్మస్ ట్రీ అలంకరణతో ఆకర్షిస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి నేటి సాయంత్రం వరకు క్రీస్తు జన్మదిన ఆరాధనలు వైభవోపేతంగా నిర్వహిస్తారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నకిన బోయిన సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా సాంబయ్య కుమారులు రమేష్, నాగరాజు, సురేష్‌ను ఆదివారం విజయ్‌చందర్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, గట్టు వేణు, బత్తిని వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదల హక్కుల సాధనకు కృషి చేద్దాం

మామునూరు: పేద ప్రజల హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషిమియా అన్నారు. సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఖిలా వరంగల్ మండలం బీఆర్ అంబేడ్కర్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం కోసం పోరాడిన ఘనత సీపీఐ దేనని చెప్పారు. కూడు,గూడు లేనటువంటి నిరుపేద ప్రజలకు అండగా ఎర్రజెండా ముందు ఉంటుందన్నారు.ఇప్పటికైనా పాలక వర్గాలు ఉన్నత వర్గాలకు ఊడిగం చేయడం మానుకొని పేద ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాల పాలన కొనసాగించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో దుండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఒర్సురావు, తాళ్లపెల్లి జాన్‌పాల్, ఎండి అక్బర్, యాకూబ్, నవంబి, విజయలక్ష్మీ, చిట్యాల సువర్ణ, చిరంజీవి, రాజు, జోసెఫ్ కుమార్, దీపిక ప్రశాంత్, ప్రభాకర్, రాజు రమేష్ పాల్గొన్నారు.